క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



రాజుపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: మండలంలోని రాజుపేట అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బొబ్బిలిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ వివక్ష నిర్మూలనపై ప్రజలను చైతన్యం చేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ ప్రభావతి, అరుణ, కార్యకర్తలు విజయ, ఉమాగౌరి, అరుణ, సుజాత పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న పీఓ

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో జీసీఎస్‌ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల్లో భాగంగా బుధవారం బాల్యవివాహాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనార్థాలను, బాలికల హక్కులు, బాలల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎన్ఎస్ఎస్ పీఓ తురంగి విశ్వనాథం వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు



బాడంగిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

బాడంగి: ఎన్నికల కోడ్ అమలుకు ఎన్నికల సంఘం ఇచ్చిన 72 గంటల సమయం ముగిసినందున ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎన్నికల కోడ్ అమలు పర్యవేక్షణ అధికారి ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించినట్లు చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, అసంఘటిత చర్యలకు, కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరిగితే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. ఏఆర్ఓ, తహసీల్దార్ రాజారావుతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల కోడ్ అమలుతీరును పర్యవేక్షించారు.

వర్షంలో పనులు చేయొద్దు



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: వర్షం కురిసే సమయంలో ఉపాధి పనులు చేయవద్దని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని పారంపేట గ్రామంలో తమ్మినాయుడు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రెండు పూటలా పనులకు వెళ్లాలని వేతనదారులకు సూచించారు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో, వర్షం కురుస్తున్నప్పుడు పనులు చేపట్టొద్దన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270లు వేతనం వస్తుందన్నారు. ఆయన వెంట టీఏ పార్థసారధి, ఫీల్డ్ అసిస్టెంట్ నాయుడు ఉన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం..



సెప్టిక్ క్లీన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

బొబ్బిలి: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని మేదరి బంద, బొప్పడాపు వీధి, బంగారమ్మ కాలనీ, గొల్లవీధి ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. వీధులు, కాలువల్లో వ్యర్థాల తొలగింపులో కార్మికులు అలసత్వం ప్రదర్శించొద్దని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సెప్టిక్ క్లీన్ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. పర్యావరణ ఇంజినీర్ సోమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

అక్కచెల్లెమ్మలకు 'చేయూత'



మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు(ఫైల్‌ఫొటో)

- మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- వైఎస్సార్ చేయూత కింద ఆర్థిక సాయం అందజేత
- నియోజకవర్గంలో 20,589 మందికి లబ్ధి

రాజాం: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేయడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో 45 ఏళ్లు దాటిన మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అందించారు. అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారుకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నాలుగు విడతలుగా సొమ్మును జమచేశారు. ఆ నిధులతో లబ్ధిదారులు పాన్‌షాపులు, జిరాక్స్ మిషన్లు, పిండి మరలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆవులు, గొర్రెలు, మేకలు వంటి వాటిని కొనుగోలు చేసి ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. వారి కాళ్లపై వారు నిలబడుతున్నారు.

మండలం	లబ్ధిదారులు	అందిన చేయూత సాయం
రాజాం(పట్టణం)	2321	రూ.16.63 కోట్లు
రాజాం	4283	రూ.29.53 కోట్లు
రేగిడి	5938	రూ.41.62 కోట్లు
వంగర	3478	రూ.23.45 కోట్లు
సంతకవిటి	4569	రూ.32.04 కోట్లు

నియోజకవర్గంలో ఇలా..

నాలుగు విడతలుగా రాజాం నియోజకవర్గంలో 20,589 మంది మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.143.25 కోట్లు నగదు లబ్ధి చేకూరింది. ప్రతీ అర్హురాలి బ్యాంకు ఖాతాలో నాలుగేళ్లలో రూ.75 వేలు చొప్పున జమ అయింది. ఎటువంటి సిఫార్సులు, దళారీ వ్యవస్థ లేకుండా నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమకావడం విశేషం.

పాడి ఆవులు కొన్నాం..



నాకు వైఎస్సార్ చేయూత కింద నాలుగు విడతలుగా నగదు అందింది. ఈ నగదుతో పాటు మరికొంత పెట్టుబడి పెట్టి రెండు పాడిఆవులు కొనుగోలుచేశాం. పాలు అమ్మగా వచ్చిన డబ్బులతో ఇంటి ఖర్చులు, ఇతర అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

– తాడ్డి రామలక్ష్మి, లక్ష్మీపురం, రాజాం మండలం

ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి



మాకు వైఎస్సార్ చేయూత ద్వారా నాలుగు విడతలుగా నగదు వచ్చింది. ఈ నగదు మాకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంతగానో ఉపయోగపడింది. చిన్నచిన్న అప్పులు నుంచి బయటపడ్డాం. మా కష్టాలు తీర్చిన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుంటాం.

– గేదెల కృష్ణవేణి, నందబలగ పంచాయతీ, రాజాం మండలం

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



రేగిడి: వెంకటాపురంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డాక్టర్ తలే రాజేష్

- రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రాజాం మున్సిపాలిటీ పరిధి సారధిలో బుధవారం ఇంటింట ప్రచారం చేశారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు దూబ గోపాలం, కిలారి శ్రీనివాసరావు, తోట తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌లు కోరారు. మండలంలో ఖండ్యాం పంచాయతీకి అనుబంధంగా ఉన్న కె.వెంకటాపురం గ్రామంలో బుధవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించారని, ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. గ్రామంలో పర్యటించిన ఎంపీ బెల్లానకు, ఎమ్మెల్యే అభ్యర్థి తలె రాజేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, ఎంపీటీసీ కింజరాపు వాగ్దేవి, పోలినాటి వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు పద్మావతి, ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావు, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- డీఎస్పీ శ్రీనివాసరావు



రామభద్రపురం: తారాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు



బాడంగి: ముగడలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు



బొబ్బిలి: మెయిన్‌రోడ్డులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గుర్తించిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలించిన, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన, అసాంఘిక శక్తులకు సహకరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందివ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్సై జ్ఞానప్రసాద్, ఏఎస్ఐ ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

బాడంగి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై ఆర్.జయంతి అన్నారు. మండలంలోని ముగడ, కోటిపల్లి గ్రామాల్లో బుధవారం కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి భయం, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బొబ్బిలి: పట్టణంలోని మిలటరీకాలనీ, రాజమహల్ కాలనీ, మెయిన్ రోడ్డు మీదుగా కేంద్ర, రాష్ట్ర పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్సై జి.లోవరాజులతో పాటు కేంద్ర సాయుధ బలగాల పాల్గొన్నాయి. శాంతియుతంగా పోలింగ్ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ముగిసిన రామాలయ ప్రతిష్ఠోత్సవం



తెర్లాం: సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



తెర్లాం: రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రామాలయ ప్రతిష్ఠోత్సవాలు బుధవారంతో ముగిసాయి. గ్రామస్తులంతా ఏకమై ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామవీధుల్లో ఊరేగించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీరాముని దీవెనలు ప్రజలందరిపై ఉండాలి: ఎమ్మెల్యే

తెర్లాం: శ్రీరాముని చల్లని దీవెనలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నానని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠోత్సవంలో బుధవారం ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నందిగాంలో రామాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు బొబ్బిలి వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠోత్సవాలు

రాజాం: మున్సిపాలిటీ పరిధి బుచ్చింపేటలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయ ప్రతిష్ఠోత్సవాలను ఈనెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పురోహితులు రంపా హనుమంతురావు బుధవారం తెలిపారు. రూ.80 లక్షల అంచనా వ్యయంతో గ్రామస్తులంతా కలిసి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఉత్తరాంధ్రాలో ఎక్కడా లేని విధంగా ఆలయం వద్ద 50 అడుగుల ఏకశిలా ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించినట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు, అన్నసంతర్పణలు నిర్వహించడంతో పాటు కోదండరామ స్వామివారికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు భక్తులు 11 రోజుల పాటు శ్రీరాముని దీక్ష చేపట్టారు.

చిరుద్యోగుల కల సాకారం



డీఎంహెచ్ఓ భాస్కరరావు చేతులమీదుగా రెగ్యులర్ నియామక పత్రం అందుకుంటున్న ల్యాబ్‌అసిస్టెంట్ ఆనందరావు (ఫైల్)

- వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- నెరవేరిన దశాబ్దాల కల

రామభద్రపురం: వైద్యారోగ్య శాఖలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఉద్యోగాలకు భరోసా కల్పించారు. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు (మేల్, ఫిమేల్), గ్రేడ్-2 ఫార్మసిస్టులు, ల్యాబ్ అసిస్టెంట్ల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ల్యాబ్ టెక్నీషియన్స్ 21, ఫార్మసిస్టులు 08, ఏఎన్ఎంలు 13, హెల్త్ అసిస్టెంట్లు 105 మందిని పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు రావడంతో ఆయా ఉద్యోగులకు డీఎంహెచ్ఓ భాస్కరరావు నియామక పత్రాలు అందజేశారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మా జీవితాలకు వెలుగులొచ్చాయి..

దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని బాధపడ్డాం. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు న్యాయం చేస్తామని మాటిచ్చారు. అధికారంలోకి వచ్చాక వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి మా జీవితాల్లో వెలుగులు నింపారు. దశాబ్దాల నిరీక్షణ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఫలించింది. మేమంతా సీఎంకు రుణపడి ఉంటాం.

– ఆనందరావు, ల్యాబ్ అసిస్టెంట్, రామభద్రపురం పీహెచ్‌సీ

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

రాజాం సిటీ: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలని పీఎంఈజీపీ ఇన్‌చార్జి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సెయింటాన్స్ స్త్రీశక్తి కేంద్రంలో జీఎంఆర్ వీఎఫ్ సహాయంతో మహిళలకు ఇస్తున్న స్వయం ఉపాధి శిక్షణను బుధవారం పరిశీలించారు. శిక్షణ అనంతరం రాయితీ రుణాలు ఇచ్చి జీవనోపాధి పొందేలా ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మేనేజర్ సి.నాగరాజు, సెయింటాన్స్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కన్నంనాయుడు

వంగర: మండలంలోని తలగాం గ్రామానికి చెందిన ఖండాపు మహేందర్ నాయుడు జ్ఞాపకార్థం ఆయన తండ్రి ఖండాపు కన్నంనాయుడు బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. రూ.4 వేలు విలువచేసే జామ, సపోట, నిమ్మ, బత్తాయి, తదితర రకాల మొక్కలను గ్రామంలోని 600 కుటుంబాలకు అందజేశారు. మొక్కల సంరక్షణ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

పదో తరగతి పరీక్షలకు 36 మంది గైర్హాజరు

రాజాం: పట్టణంతో పాటు రాజాం మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. మొత్తం ఎనిమిది కేంద్రాల్లో 1642 మంది విద్యార్థులకు గాను బుధవారం 1606 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డోలపేట హైస్కూల్‌లో పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వేపాడ: జాకేరులో సీతమ్మకు సారె తీసుకువెళుతున్న భక్తులు

వేపాడ: జాకేరు గ్రామంలో రామాలయ వార్షికోత్సవం సందర్భంగా సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా సర్పంచ్ ఇంటి నుంచి సీతమ్మ తల్లికి 108 రకాల స్వీట్లు, పండ్లతో ఊరే గింపుగా సారె తీసుకువెళ్లారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మహిళ కోలాటం ఆకట్టుకుంది. నెల్లిమర్ల దుర్గా పీఠాధిపతి శ్రావణ చైతన్యానంద స్వామి (చిన్నస్వామి) ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

జామి: మండలంలోని పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కోదండరామస్వామి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



రేగిడి: సీతారాములను దర్శించుకుంటున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తలే రాజేష్, తదితరులు

శివాలయంలో..



నవగ్రహ మండప పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో వెలసిన శివ పంచాయతన ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాకాశీవిశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో సూర్యనమస్కారాలు, నవగ్రహ మండప హోమాలు, మహా విద్యాపారాయణం, కుంకుమ పూజలు చేపట్టారు. వేదపండితులు అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన పోలిపల్లి జాతర



ఘటాలను ఊరేగింపుగా గుడికి తీసుకొస్తున్న భక్తులు

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం రాత్రితో ముగిసింది. గత నెల 15న నేత్రోత్సవంతో ప్రారంభమైన ఈ జాతర ఘటోత్సవంతో ముగిసింది. కొండంపేట వనం గుడి నుంచి లంకలపల్లి కుటుంబీకులు మేళతాళాలతో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ఘటాలను మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి'



కొండకెంగువలో ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులు

గ్రామాల్లో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు పూర్తికావడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు వేతనదారు ఉత్సుకత చూపుతున్నారు. మండలంలో సుమారు 11 వేల వరకు జాబ్‌కార్డులు ఉండగా.. ప్రస్తుతం 6 వేల మంది వరకు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

– రామభద్రపురం